క్లుప్తంగా

చెత్తతో సంపద తయారు చేద్దాం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ

పిఠాపురం: చెత్తను సద్వినియోగం చేసుకుంటే సంపద తయారవుతుందని, ఈ విషయంపై అవగాహన కల్పించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో చెత్తను త్రిబుల్ ఆర్ కేంద్రానికి అందజేయాలని గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ కోరారు. స్థానిక నగర పంచాయతీ 1, 2 సచివాలయాల పరిధిలో శుక్రవారం మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్ కార్యక్రమంలో భాగంగా వార్డు సచివాలయాల సిబ్బంది మెప్మా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ మెటీరియల్స్ అయిన దుస్తులు, పుస్తకాలు, చెక్కలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు జాగ్రత్త చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. 20వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకూ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పలువురు వార్డు సచివాలయాలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళులు



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి, నియోజకవర్గ సీపీఎం విస్తృతస్థాయి సమావేశాన్ని స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యురాలు దువ్వా శేషుబాబ్జీ పాల్గొని మాట్లాడుతూ సుందరయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సామర్లకోట నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు సీసీఆర్సీ కార్డు



సదస్సులో మాట్లాడుతున్న వీహెచ్ఏ చిలకమ్మ

పెద్దాపురం: ప్రతి రైతుకు పంటసాగు హక్కు పత్రం (సీసీఆర్సీ) మంజూరుకు చర్యలు చేపట్టినట్టు మండల వ్యవసాయ విస్తరణాధికారి ప్రసాద్ అన్నారు. మండలంలోని ఆర్బీ పట్నం ఆర్బీకే వద్ద శుక్రవారం వ్యవసాయ సహాయకులు ఎం.చిలకమ్మ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఈఓ ప్రసాద్, వీహెచ్ఏ చిలకమ్మ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం, ఎరువులు, పంట నష్టం, సబ్సిడీ వంటి వాటికి ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీసీఆర్సీ కార్డుకు కావాల్సిన రైతులు పొలం పాస్ బుక్, రైతు ఆధార్, ఫోన్ నెంబర్, కౌలు రైతు ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ అకౌంట్ జిరాక్సులతో సంబంధిత కార్యాలయంలో అందజేసి సీసీఆర్సీ కార్డును పొందాలని సూచించారు.

మెప్మా ఆర్పీల శిక్షణ ప్రారంభం



పిఠాపురం మెప్మాలోని ఆర్పీలకు శిక్షణ ఇస్తున్న జయరాజ్

సామర్లకోట: జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలో మెప్మా రిసోర్స్‌పర్సన్లకు ఇస్తున్న శిక్షణలో భాగంగా శుక్రవారం తుని మున్సిపాలిటీ పరిధిలోని ఆర్పీలకు రెండు రోజుల శిక్షణను మెప్మా జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎల్.జయరాజ్ శిక్షణను ప్రారంభించారు. ఈ శిక్షణకు 39 మంది ఆర్పీలు హాజరయ్యారు. మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మెప్మా సీఎంఎం, సీఓలు పాల్గొన్నారు.

ఉచిత సంగీత శిక్షణ

సామర్లకోట: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శ్రీ శారదా సంగీత నిలయం ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత సంగీత శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులకు వేసవి సెలవులు కావడంతో శ్రీ శారదా సంగీత నిలయం సంగీత ఉపాధ్యాయిని లోకారెడ్డి సూర్యావతి ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు సంగీత శిక్షణ ఇస్తున్నారు. ఈ నెలాఖరు వరకు నిర్వహించే శిక్షణలో 30 మంది సంగీతం నేర్చుకొంటున్నట్లు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు.

● తురాయి.. ఎంత ఆహ్లాదమోయి



ఉప్పాడ- పిఠాపురం రోడ్డులో విరబూసి కనువిందు చేస్తున్న తురాయి పుష్పాలు

వసంత రుతువులో చెట్లు నూతన చిగురులు, పూత, పుష్పాలతో కొత్త శోభను సంతరించుకుంటాయి. ఉప్పాడ- పిఠాపురం, కొత్త ఇసుకపల్లి- పాత ఇసుకపల్లి రోడ్డులో ఇరువైపులా ఉన్న తురాయి చెట్లు ఎర్ర పూలుతో ఆహ్లాదపరుస్తున్నాయి. వాహనచోదకుల మనసు దోచుకుంటున్నాయి. పచ్చని లేత ఆకులు, ఎర్రని పూలతో ఆహ్లాదకర వాతావరణాన్ని తలపిస్తున్నాయి. -కొత్తపల్లి

● నీటి వృథా.. పట్టదా!



పైపులైన్ లీకేజీతో యండపల్లి జంక్షన్ వద్ద రోడ్డుపైకి చేరిన తాగునీరు

గొంతు తడపాల్సిన నీరు రోడ్డెక్కుతోంది.. అయినా అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఉప్పాడ- పిఠాపురం రోడ్డులో కొండెవరం సమీపం, యండపల్లి జంక్షన్ వద్ద కొంతకాలం కిందట తాగునీటి పైపులైన్లకు రంధ్రాలు పడ్డాయి. దీనివల్ల తాగునీరు వృథాగా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్లకు మరమ్మతులు చేట్టాలని ప్రజలు కోరుతున్నారు. - కొత్తపల్లి

బాస్కెట్ బాల్ ఆడేద్దామా..

- వేసవిలో చిన్నారులకు శిక్షణ
- 15 ఏళ్లుగా కొనసాగుతున్న శిబిరం
- మెరికల్లాంటి క్రీడాకారులను సిద్ధం చేస్తున్న 'గుడ్ ఫ్రెండ్స్'

సామర్లకోట: క్రీడలపై చిన్నారులకు ఆసక్తి కలిగేలా గుడ్ ఫ్రెండ్స్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఎంతో కృషి చేస్తోంది. స్థానిక ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లోని సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు సుమారు 15 ఏళ్లుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో చిన్నారులకు వేసవిలో చిన్నారుకు బాస్కెట్ బాల్‌లో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గుర్తింపు ఉన్న ఈ సంఘం సామర్లకోట నుంచి ఉత్తమ క్రీడాకారులను తయారు చేస్తోంది. పగటి పూటే కాకుండా రాత్రి వేళ ఫ్లడ్ లైట్ల వెలుగులోనూ శిక్షణ ఇస్తున్నారు.



గోల్ వేయకుండా డిఫెన్స్ చేయడంపై శిక్షణ

సంఘం ప్రతినిధులు ఎండీవీ ప్రసాద్, పి.గిరిధర గోపాల్, జి.సంజయ్, ఐ గోపాలకృష్ణ తదితరుల శిక్షణలో ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. ఇటువంటి టోర్నీలు నిర్వహించడానికి అనువైన ఆట స్థలంలో ప్రస్తుతం 80 మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారు.



బాస్కెట్ బాల్‌లో మెళకువలు నేర్చుకుంటున్న చిన్నారులు

తొమ్మిది ఏళ్లుగా శిక్షణ



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచి బాస్కెట్ బాల్‌లో శిక్షణ పొందాను. ప్రస్తుతం డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నా. స్టేట్ మీట్‌లో పాల్గొని సర్టిఫికెట్లు పొందాను. కోచ్ గోపాలకృష్ణ మంచి శిక్షణ ఇచ్చారు.

– కోరా అజయ్, డిగ్రీ విద్యార్థి, సామర్లకోట

మంచి సదుపాయాలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాస్కెట్ బాల్ కోర్టు వద్ద మంచి సదుపాయాలు ఉన్నాయి. ఏడేళ్లుగా బాస్కెట్‌బాల్‌లో మెళకువలను నేర్చుకొంటున్నా. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలన్నది ఆశయం.

– యాదగిరి శ్రీనివాసు, ఇంటర్ విద్యార్థి, సామర్లకోట

క్రీడపై ఆసక్తి ఉండాలి



బాస్కెట్ బాల్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉండాలి. 15 ఏళ్లుగా గుడ్ ఫ్రెండ్ అసోసియేషన్ ద్వారా వేసవి కాలంలో ఆసక్తి ఉన్న చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాం. మెరికెల్లాంటి క్రీడాకారులను తయారుచేయడమే లక్ష్యం. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న కోర్టును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఐ.గోపాలకృష్ణ, బాస్కెట్‌బాల్ కోచ్, సామర్లకోట

పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దొరబాబు
- పలు వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

పెద్దాపురం : పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. 'గడప గడపకూ ప్రభుత్వం'లో భాగంగా గురువారం పెద్దాపురం పట్టణంలోని 12, 13వ సచివాలయం పరిధిలో 23, 26వ వార్డుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయరు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఆ వార్డు కౌన్సిలర్లు ముప్పన శ్యామలాంబ, బొబ్బిలి వీర వెంకట దుర్గ, సచివాలయ సిబ్బందితో కలసి గడపగడపకూ సందర్శించి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయడానికే సీఎం జగన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, బొబ్బిలి హరిబాబు, నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఎల్ఎన్‌పురంలో గడప గడపకూ..

పిఠాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్ఎన్‌పురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆయన గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల చెంతకే పరిపాలన తీసుకువచ్చిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు నేరుగా పథకాలు అందుతున్నాయన్నారు. ఒకటో తేదీన పింఛన్లు ఇంటి వద్దే లబ్ధిదారులకు అందిస్తూ చరిత్ర సృష్టించారన్నారు. జెడ్పీ వైస్



ఎల్ఎన్‌పురంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

చైర్మన్ బుర్రా అనుబాబు, సర్పంచ్ పడాల ఏడుకొండలు, జవ్వాది నాయుడు, ఉలవల భూషణం, నడిగట్ల చింతలరావు, గట్టి మోహనరావు, ముమ్మిడి శేఖర్, పలువురు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆయన స్థానిక గ్రామ సచివాలయాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ప్రభుత్వ సేవలు నిర్ణీత సమయానికి ప్రజలకు అందించాలని సిబ్బందికి సూచించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే దుష్ప్రచారం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- అమీనాబాదులో హార్బర్ పనుల పరిశీలన

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీర ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేస్తుందని, ఇది చూసి ఓర్వలేక టీడీపీ దుష్ప్రచారం చేస్తుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. అమీనాబాదు తీర ప్రాంతంలో జరుగుతున్న ఉప్పాడ మేజర్ హార్బర్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రూ.371 కోట్లతో హార్బర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రారంభించిన సుమారు ఆరు నెలల్లోనే 51 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఈ పనులను చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే వర్మ హార్బర్ నిర్మాణంపై ఎల్లో మీడియా ద్వారా ఆరోపణలకు దిగుతున్నారని అన్నారు. హార్బర్‌ను తానే తీసుకువచ్చానంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో ఉప్పాడను దత్తత తీసుకుని నీవు ఏం అభివృద్ధి చేశావో తెలపాలని అన్నారు. ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టేందుకు సుమారు రూ.30 కోట్లు, కోతకు గురవుతున్న బీచ్ రోడ్డు అభివృద్ధికి రూ.34 కోట్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ మేరీ టైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎస్ఈ ఎస్.నాగేష్ మాట్లాడుతూ ఉప్పాడ మేజర్ హార్బర్ నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పూర్తిగా సముద్ర గర్భంలో జరుగుతుందన్నారు. ఈ పనులు జరుగుతున్న సమయంలో ప్రకృతి వైపరిత్యాల కారణంగా పనులకు ఆటంకం కలగడం సాధారణమన్నారు. వాటిని ఆధారంగా తీసుకుని కొన్ని పత్రికలు నిర్మాణ లోపాలు ఎత్తి చూపడం తగదన్నారు. ఈ పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయని తెలిపారు. హార్బర్ నిర్మాణ పనులు పూర్తయిన తరువాత రెండేళ్ల వరకూ నిర్వహణ బాధ్యత సంస్థదేనన్నారు. ఈ హార్బర్ నిర్మాణంతో ఈ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారతాయన్నారు. ఈ నిర్మాణానికి ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, సర్పంచులు నక్కా మణికంఠబాబు, పులి జయబాబు, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మత్స్యకార నాయకుడు ఉమ్మిడి జాన్, కంబాల లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఉన్నారు.

ఘనంగా నేరేళ్లమ్మ తీర్థం

కొత్తపల్లి: కొమరగిరి గ్రామ దేవత నేరేళ్లమ్మ అమ్మవారి తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం నుంచే కాకుండా గోర్స, పండూరు, వెంకటరాయపురం, పెదకలవలదొడ్డి తదితర ప్రాంతాల భక్తులు అమ్మవారికి చలివిడి, వడపప్పును నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారిని ఎంపీపీ కారే సుధ, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిని సురేష్‌కుమార్, కఠారి చంటిబాబు,



నేరేళ్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడే సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. ఎంపీపీ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

రహదారి విస్తరణకు పరిశీలన

కాకినాడ సిటీ: జగన్నాథపురం పాత బ్రిడ్జి నుంచి మున్సిఫ్ జంక్షన్ వరకు (యానాం రోడ్డు) నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలసి తనిఖీ చేశారు. ఈ రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల వెడల్పు చేసేందుకు పరిశీలించినట్లు తెలిపారు. రోడ్డు ఇరుకుగా ఉన్న దృష్ట్యా రోడ్డును ఇరువైపులా ఉన్న భవనాల యజమానులకు సమాచారం సేకరించేందుకు సంబంధిత ప్లాన్లను తయారు చేయడానికి తీసుకునే చర్యలపై సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ సర్వేయర్, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్, ప్లానింగ్ సెక్రటరీలు, ఇంజినీరింగ్ సిబ్బందితో ఆయన రోడ్డు విస్తరణపై పరిశీలించారు.

నేటి నుంచి మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ షహర్

జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ షహర్ శనివారం నుంచి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్పొరేషన్ పరిధిలో 14 చోట్ల పాత వస్తువుల సేకరణ జరుగుతున్నట్టు కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. రెండు కేజీలకు మించి వస్తువులను అందజేసే వారికి కమిషనర్ పేరుతో ప్రశంసా పత్రం ఇస్తున్నారు. రెడ్యూస్, రీ సైకిల్, రీయూజ్ నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు వివేకానంద పార్కు ఆవరణలోని భరతమాత విగ్రహం వద్ద కమిషనర్ మహేష్‌కుమార్, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్

శాశ్వత భవనాలు సత్వరం పూర్తి చేయండి

కాకినాడ సిటీ: ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలను వేగవంతం చేసి గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులు పురోగతిపై జెడ్పీ, డ్వామా, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, మైన్స్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణ పనుల్లో పురోగతి కనబరచాలన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంజూరు చేసిన ప్రతి భవన నిర్మాణాన్ని వెంటనే మొదలు పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ ఎం.వెంకటలక్ష్మి, డీపీవో ఆర్.విక్టర్, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఆర్.రమేష్, మైన్స్ డీడీ ఇ.నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.శ్రీనివాసు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఆర్బీ పట్నం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

పెద్దాపురం: మండలంలోని ఆర్బీ పట్నం ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఉపాధి పనుల సామాజిక తనిఖీ వేదికలో ఆయనపై వచ్చిన ఫిర్యాదులు, అవినీతి నేరం రుజువు కావడంతో ఆ శాఖాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయినట్టు ఎంపీడీఓ హిమమహేశ్వరి తెలిపారు. అవినీతి సొమ్మును రామకృష్ణ నుంచి రికవరీ చేయనున్నట్టు ఆమె తెలిపారు.

పూడిక తొలగింపు



గాంధీచౌక్ కల్వర్టు వద్ద తుప్పలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సామర్లకోట: స్థానిక గాంధీచౌక్ వద్ద ఉన్న కల్వర్టులోని పూడిక తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రధాన రోడ్డులో పెరిగిపోయిన పూడిక అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టరు స్పందించి కల్వర్టు వద్ద పెరిగిన తుప్పలను, పూడికను తొలగించారు.

మరిడమ్మ తల్లిని దర్శించుకున్న జిల్లా జడ్జి



జడ్జి హరినారాయణకు ఆశీర్వచనం అందిస్తున్న పండితులు

పెద్దాపురం: జిల్లా నాలుగో అదనపు జిల్లా జడ్జి హరినారాయణ శుక్రవారం పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్‌వి రామ్మోహనరావు ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలుకగా ఆలయ వేద పండితులు ఆశీర్వచనం అందించారు. జడ్జి హరినారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారికి మఖ నక్షత్ర పూజలు

స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో మఖ నక్షత్ర పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుకు ఫోన్ నంబరు అనుసంధానం



పీడీ వెంకటలక్ష్మి

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకానికి సంబంధించిన జాబ్‌కార్డులకు ఫోన్ నంబర్ అనుసంధానం తప్పనిసరి అని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. వాకతిప్పలో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే జాబ్ కార్డులకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేశారన్నారు. ఫోన్ నంబర్ కూడా పూర్తి స్థాయిలో అనుసంధానం చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. జిల్లాలో రోజుకు లక్ష మందికి ఉపాధి పని కల్పించడానికి లక్ష్యం కాగా 87 వేల మంది వస్తున్నారన్నారు. పని కావాలన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సిబ్బందికి తెలిపారు. ఫారీ కల్చర్ ద్వారా మునగ, గులాబీ, మల్లి తోటలను రైతులు పెంచుకోవచ్చన్నారు. ఆమె వెంట ఏపీఓ బండే రాజబాబు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

సెబ్ ఏఎస్పీగా ప్రేమ్ కాజల్

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అదనపు ఎస్పీగా ప్రేమ్ కాజల్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ప్రేమ్ కాజల్ ఓ గ్రూప్ వన్ అధికారి, విశాఖ దిశ పీఎస్ ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్న ఆమె పదోన్నతి పొంది కాకినాడ జిల్లాకు బదిలీపై వస్తున్నారు. కాకినాడ జిల్లా అడ్మిన్ ఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాస్ సెబ్ ఏఎస్పీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్న విషయం తెలిసిందే.